కథ

# తప్పెవరిది?

అత్తలూరి విజయలక్ష్మి



"మాధవి వస్తోంది తెలుసా"... విశాల్ చేతికి కాఫీ కప్పు అందిస్తూ చెప్పింది అపర్ణ...

చదువుతున్న న్యూస్ పేపర్‌మీంచి చూపుతిప్పి ఆమె చేతిలోంచి కప్పు అందుకుంటున్నవాడల్లా ఆ మాట విని కళ్లెత్తి చూశాడు... అపర్ణ మొహంలో ఓ విధమైన భయం కనిపించింది. అతని చూపులతో చూపు కలిపి ఒక్కసారి కనురెప్పలు వాల్చేసింది..

"ఎప్పుడు? ఎవరు చెప్పారు?" అడిగాడు కనుబొమ్మలు ముడుస్తూ..

"వసంతగారు చెప్పారు.. నిన్న శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం నోము పేరంటానికి మాధవి వాళ్లింటికి వెళ్లారుట... ఇల్లంతా చిన్నచిన్న మార్పులు చేసి గోడలకు, తలుపులకు రంగులు వేశారుట... ఇండియన్ టాయిలెట్స్ స్థానంలో వెస్టన్ టాయిలెట్ కట్టించారుట... చాలా హడావుడిగా ఉన్నారుట శాంతగారు వాళ్లు..." కొంగువేలికి చుట్టుకుంటూ చెప్పింది...

"అలాగా..." విశాల్ కాఫీ కొద్దిగా సిప్‌చేసి మౌనంగా ఎటో చూస్తూ ఉండిపోయాడు. కొద్ది క్షణాలు అతనేమన్నా చెప్తాడేమో అని ఎదురు చూసి, అతనేమీ మాట్లాడకపోవడంతో అపర్ణ నిశ్శబ్దంగా లోపలికెళ్లి పోయింది... ఆమెకి ఆ తరవాత ఏ పనిమీదా ఏకాగ్రత కుదరలేదు... నిన్న వసంత నోటి నుంచి మాధవి వస్తోందన్న వార్త తెలిసిన దగ్గర్నించీ మనసులో విపరీతమైన ఆందోళన మొదలైంది. భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపిస్తోంది. సైనికులు నిత్యం కాపలా కాస్తున్న పటిష్టమైన కోటలోంచి తననెవరో దట్టమైన అడవిలోకి విసిరేస్తున్న అభద్రతాభావం ఆమెని నిలువెల్లా వణికిస్తోంది... ఎలా? ఇప్పుడెలా? ఎక్కడికెళ్లాలి? ఎలా బతకాలి? ఏం చేయాలి? ఈ ఇంట్లో తన స్థానం పోయినట్టేనా? ఇది మాధవి ఇల్లు... మాధవి సామ్రాజ్యం... పరాయి దేశం పైకి దండెత్తి, అక్రమంగా ఆక్రమించుకున్న దురాశపరుడైన రాజులా తను ఈ ఇంటిని ఆక్రమించుకుంది..

ఇలా జరగడంలో తన తప్పెంత? అవును తప్పు తనదేనా? తన నిస్సహాయతదా? తన పేదరికానిదా? తన స్వార్థానిదా? ఉలిక్కిపడింది అపర్ణ... నేను స్వార్థపరురాలినా? ఎదుటివాళ్ల అవసరాన్ని అవకాశంగా తీసుకుని తాత్కాలిక ఆశ్రయాన్ని శాశ్వత స్థావరంగా మార్చుకుందా? ఇందులో విశాల్ తప్పేం లేదా? మరణించిన ప్రభావతి గారి తప్పులేదా? ఎవరిది తప్పు?

ఆలోచనలు కందిరీగల్లా మెదడుని కుడుతున్నాయి... అపర్ణకి తెరలు, తెరలుగా దుఃఖం వస్తోంది.. కానీ చిత్రం ఆ దుఃఖం బైటికి రావడం లేదు... గుండెల్లో ఉండలు, ఉండలుగా చుట్టుకుంటూ గొంతుకీ, గుండెకీ అడ్డంగా నిలబడింది... ఒక్క కన్నీటి చుక్క చెంపలమీదికి రాలినా చాలు కొంతన్నా ఉపశమనం కలుగుతుంది. అదేవిటో నిన్నటి నుంచి, వసంతగారు మాధవి రాక గురించి చెప్పిన దగ్గర్నించీ కూడా మనసు పెద్ద కొండరాయిని మోస్తున్నంత బరువుగా మారింది.

తప్పుచేసి దొరికిపోయిన దానిలా నేరస్థురాలిలా ఆత్మనూన్యతా భావం నిలువెల్లా కాలుస్తోంది. నిజానికి తనీ ఇంటికి స్వార్థంతో రాలేదే... ఆ రోజు... అమ్మ తనని ఒంటరిని చేసి వెళ్లిపోయిన రోజు, ఉన్న ఆర్థిక సౌలభ్యం మేనేజరు కలం పోటుతో కుప్పకూలిన రోజు దిక్కుతోచక, దిక్కులేకా పుట్టెడు దుఃఖంతో అగమ్యగోచరంగా నిలబడిన రోజు, పక్కింటి రాగిణి న్యూస్‌పేపర్‌లో విశాల్ ఇచ్చిన ప్రకటన చూపించింది. వెంటనే పరుగులు పెడుతూ విశాల్‌ని కలిసింది.. తన నిస్సహాయ స్థితి వివరించి తనకి అతని ఇంట్లో ఆశ్రయం ఇవ్వమని వేడుకుంది.. విశాల హృదయంతో విశాల్ అంగీకరించాడు... ఉన్న కొద్దిపాటి సామాను సర్ది రాగిణి ఇంట్లో దాచేసి, తన బట్టలు మాత్రం సూట్‌కేసులో పెట్టుకుని ఇల్లు ఖాళీచేసి సరిగ్గా మూడేళ్ల క్రితం ఈ ఇంట్లో అడుగు పెట్టిన రోజు తనకేమీ అనిపించలేదు... వాళ్లకొక తోడూ తనకొక నీడ దొరికింది అనుకుంది... మంచానపడిన ఓ వృద్ధురాలికి సేవ చేయడం అదృష్టంగా భావించింది. ఆమెని కంటికి రెప్పలా చూసుకుని, ప్రశాంతంగా ఆమె మరణించడానికి తన వంతు కర్తవ్యాన్ని ఆనందంగా నిర్వర్తించింది. చివరిసారిగా ఆమె తనవైపు చూస్తూ ప్రదర్శించిన కృతజ్ఞతాభావంతో మనసంతా ఆనందంతో నిండిపోయింది... కన్నీళ్లతో తన కొడుకుకి తోడుగా ఉండమని అడిగితే ముందు తన అదృష్టానికి ఆశ్చర్యపోయింది... ఆ తరువాత ఆలోచించింది. కానీ, ఆ పరిస్థితుల్లో ప్రభావతిగారి నిష్క్రమణం తరవాత తనకి మళ్లీ భవిష్యత్తు శూన్యంగా మారబోతుందన్న భయం ఆలోచనని అణిచేసి, అంగీకారాన్ని తెలిపింది... అదే ఇంట్లో ఓ సేవకురాలిగా కాక, ఓ గృహిణిగా నిలదొక్కుకుంది.



ఇప్పుడు... ఆయాచితంగా లభించిన అదృష్టాన్ని ఎత్తుకుపోడానికి గద్దలా మాధవి వస్తోంది... ఎలా? ఎలా ఈ ఇంట్లో తన స్థానం కాపాడుకోవాలి? తనేం చేయగలదు? తనకి స్థానం ఇచ్చిన వ్యక్తి మౌనంగా ఉన్నాడు. అతనేదన్నా అభయం ఇస్తాడని నీ స్థానం ఎక్కడికీ పోదు... ఎవరు వచ్చినా, ఏం జరిగినా నీకు ఎటువంటి హానీ జరగదు అని ధైర్యం చెప్తాడనుకుంది. ఇప్పుడు... ఇప్పుడు అతనేం మాట్లాడలేదు. ఇక తనీ ఇంట్లోంచి వెళ్లిపోవాల్సిందేనా? వెళ్లి ఎక్కడ ఉండాలి? ఎలా బతకాలి? ఉద్యోగం చేయాలంటే మళ్లీ క్రూరమృగాల స్థావరంలోకి వెళ్తున్న భావన... భయం. ఒంటరిగా ఉండాలంటే భయం... ఈ సమాజంలో తను ఒంటరిగా బతకగలదా? మార్కెట్టుకి వెళ్లి కూరలు కొనలేదు. ఇంట్లోకి కావలసిన సామాను కొనలేదు.. బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేయడానిక్కూడా విశాల్ సాయం తీసుకున్న తాను, వేయి రూపాయలు పట్టుకెళితే మిగిలిన చిల్లర లెక్కపెట్టుకోడం రాని తను... అన్నిటికీ విశాల్ మీద ఆధారపడి బతుకుతోన్న తను ఒంటరిగా ఎలా బతకగలదు? నో బతకలేదు... అలా అనుకుంటోంటే ఎందుకో మొదటిసారిగా తన మీద తనకే చిరాకేసింది అపర్ణకి.

పరాధీన... తాను పరాధీన... ఛీ తనకసలు వ్యక్తిత్వమే లేదా? అసలిలా ఎలా తయారైంది? ఎందుకు? భయం... జీవితమంటే భయం... ఏదో ఫోబియా.... దేనికో తెలియదు... బైటికెళ్లాలంటే భయం... ఉద్యోగం చేయాలంటే భయం... వంటరిగా ఉండాలంటే భయం.. తను వంటరిగా ఉంటోందన్న వాస్తవం సమాజానికి తెలపాలంటే భయం... ఈ భయంతోటే ఇలా పరాధీనురాలైంది... ఎలా ఈ భయం పోతుంది.

అసలు ఆరోజు ప్రభావతిగారు మాధవి గురించి చెప్పిన రోజే తన వివేకం ఎందుకు పనిచేయలేదు... చట్టపరంగా తన స్థానం పదిలంగా ఉంటుందన్న భరోసా ఆవిడ నుంచి కానీ, విశాల్‌నుంచి కానీ తనెందుకు కోరలేదు... ఏ ధైర్యంతో ఈ ఇంట్లో గృహిణిగా ఉంది.. తోటి స్త్రీ తాత్కాలికంగా భర్తకు దూరమైపోగానే ఆ స్థానం తన అవసరానికి స్వంతం చేసుకోడం నీచం... ఎంత నీచమైన పని చేసింది... విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి వస్తోన్న ఆమె తనని ఎంత అసహ్యించుకుంటుందో... ఏమంటుందో... మెడపట్టి బైటికి నెడుతుందా? కోర్టుకి లాగి పరువు తీస్తుందా? పదిమందిలో నిలబెట్టి అవమానిస్తుందా? అపర్ణకి కాళ్ళ నుంచి తలదాకా ఒక్కసారి ఒళ్లంతా మంచులా చల్లగా అయి చలనరహితంగా అయినట్టు అనిపించింది.

''అపర్ణా.... ఏం చేస్తున్నావు?'' విశాల్ పిలుపుతో పాటు అతని చేయి భుజం మీద పడడంతో తృళ్లి పడి చూసింది... రక్తం గడ్డకట్టినట్టు చైతన్యరహితంగా నిలబడి గాజుకళ్లతో తనవైపు చూసిన ఆమె పాలిపోయిన మొహం చూసి ఖంగారుగా అడిగాడు విశాల్ ''ఏంటి? ఏమైంది? అపర్ణా! అరె రె ఏమైంది?'' తన చేతుల్లో వాలిపోతున్న ఆమెని పట్టుకుని కుదుపుతూ అడిగాడు...

ఒక్కసారిగా కుండ భళ్లున బద్దలైనట్టు ఆమె నోటి నుంచి పెద్దగా ఏడుపుతో కూడిన శబ్దం వినిపించింది... అతని గుండెలపైన వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది అపర్ణ....

విశాల్‌కి అర్థమైంది... మాధవి వస్తోందన్న వార్తతో ఈమె భయపడు తోంది... అభద్రతా భావం ఈమెని ఆవరించింది... అతనికి జాలేసింది... మార్దవంగా పిలిచాడు... 'అపర్ణా!'.

అపర్ణ జవాబు చెప్పలేదు... అతని పిలుపులోని ఆప్యాయతకి అప్పటి దాకా ఘనీభవించి గడ్డలుగా మారిన కన్నీరు ఒక్కసారిగా కరిగి ప్రవహిస్తోంది... కుళ్లి, కుళ్లి ఏడుస్తోంది.

విశాల్‌కి ఏం చేయాలో, ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఆమె మానసిక స్థితి అతనికి పూర్తిగా అర్థమైంది.. తల్లి బలవంతపెట్టి ఆమెని భార్యగా స్వీకరించమన్న రోజు ముందు ఆలోచించినా, మాధవి మీద కోపంతో ఉన్న తను ఆమె తనని నిర్లక్ష్యం చేసినందుకు శిక్షగా అపర్ణని స్వీకరించాడు. కానీ, ఒక్కక్షణం మాధవికి ఈ ఇంటి మీదా, తనమీదా చట్టపరంగా ఉన్న హక్కుల గురించి ఆలోచించలేక పోయాడు... మనిషిని కోపం వివేకశూన్యుడిని చేస్తుందన్న వాస్తవం తెలిసేటప్పటికి తల్లి మరణించడం, అపర్ణ భార్యగా తన స్థానం పదిలం చేసుకోడం జరిగింది... ఆ ఇంట్లో తను ఎప్పుడూ ఆమెని సేవకురాలిగా చూడలేదు... నిద్రలేచాక కమ్మటి కాఫీ నుంచి రాత్రి డిన్నర్‌దాకా రుచికరమైన వంటలు, అమ్మ విషయంలో చీకూ, చింతాలేని విధంగా ఆమె తీసుకున్న బాధ్యత, ఇల్లంతా ఎప్పుడూ శుభ్రంగా, కళ, కళ్లాడుతూ ఉంచిన తీరు ఆ ఇంట్లో అపర్ణని ఒక మెంబర్‌గానే చూశాడు... కాకపోతే ఆ మెంబర్‌షిప్‌లోని రిలేషన్‌షిప్ గురించి ఏనాడూ ఆలోచించలేదు... అమ్మ పోయే ముందు నేను పోయాక నిన్నెవరూ కనిపెట్టి ఉంటారు నాయనా... వేళకి తిండి, ఇంట్లో మాట్లాడే దిక్కులేకపోతే నువ్వేమై పోతావురా నా మాట విను.. అమ్మాయి బుద్ధిమంతురాలు... ఈ ఇంటికి తగిన కోడలు అని బలవంతం చేస్తే ఆమెకి ఆలోచనారహితంగా మాట ఇచ్చాడు... ఆమె ఎదురుగా అపర్ణ మెడలో పసుపుతాడు కట్టాడు. పిచ్చిపిల్ల ఆ తాడు చూసుకుని ఎంత మురిసిపోయిందో... విశాల్ గుండెల్ని చీల్చుకుంటూ నిట్టూర్పు వచ్చింది... తాళి అనే రెండు బంగారు నాణాలు, ఒక పసుపుతాడు కోసం ఆడవాళ్లు ఎంత పరితపిస్తారు!

మొదటి రాత్రి తన చేతుల్లో వాలిపోయిన రోజు "ఇంత అదృష్టం కలుగుతుందని నేనెన్నడూ ఊహించలేదండి" అంది అపర్ణ. కానీ "మీరిలా చేశారేంటండి? మాధవికి విడాకులివ్వకుండా నన్ను పెళ్లి ఎందుకు చేసుకున్నారు" అని అడగలేదు...

మాధవి వస్తోంది... వచ్చి ఏం చేస్తుంది? నేరుగా ఈ ఇంటికే వస్తుందా? పుట్టింటికి వెడుతుందా? ఇది తన ఇల్లు అన్న స్పృహ ఉందా మాధవికి... హక్కుగా వస్తుందా? బిడియపడుతూ వస్తుందా? తప్పుచేసిన భావనతో గిల్టీగా వస్తుందా? మాధవి తిరిగి వస్తోందన్న వార్త విశాల్ మనసులో రక, రకాల ఆలోచనలను రేకెత్తిస్తోంది... మాధవి ఇప్పుడు తన స్థానం కోసం దెబ్బలాడుతుందా? ఈమెని ఇంటి నుంచి వెళ్లగొడుతుందా? ఈమె పరిస్థితేంటి? అతనిక్కూడా బుర్ర పని చేయడం లేదు. మొద్దుబారినట్టు ఉంది... అపర్ణ దుఃఖం చూస్తుంటే హృదయం కరిగిపోయింది.

నెమ్మదిగా ఆమె చుబుకం పట్టుకుని మొహంపైకి లేవనెత్తి కన్నీళ్లు తుడుస్తూ అనురాగం ధ్వనిస్తున్న స్వరంతో అన్నాడు.. "బాధపడకు... ఎట్టి పరిస్థితుల్లో నీకు అన్యాయం చేయను సరేనా!..."

కన్నీళ్లు నిండిన కళ్లతో అతని మొహంలోకి చూసింది.., ఆ కన్నీళ్ల మధ్య నిజమా... అన్న ఆశ మిల, మిల మెరిసింది...

అభయం ఇస్తున్నట్టు మెత్తగా నవ్వాడు... "వెళ్లు మొహం కడుక్కో.... వెళ్లు... ఏడవకు" అంటూ ఆమెని నెమ్మదిగా నడిపిస్తూ వాష్‌బేసిన్ దగ్గరకు తీసికెళ్లాడు... పంపు తిప్పి కుడిచేతి నిండా నీళ్లు నింపి, ఎడం చేత్తో ఆమె భుజం పట్టుకుని ముందుకు ఒంచి నీళ్లు మొహం మీద చల్లాడు...

అతని ఆప్యాయతకీ, ఆ ప్రేమతో కూడిన చర్యకీ కదిలిపోయింది అపర్ణ... చాలు ... నాకీ అభయం చాలు అనుకుంటూ "నేను కడుక్కుంటాను" అంది సన్నగా వెక్కుతూ.... అపర్ణ మొహం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ అంది. "మీరు వెళ్లండి... ఆఫీస్‌కి టైమ్ అయిందేమో కదా... సారీ... నావల్ల లేట్ అయిందేమో".

"లేదులే పర్లేదు... నేను వెళ్లాక ఇంకేమీ ఆలోచించద్దు.... జరిగేది జరుగుతుంది... ఏది ఏమైనా నీకు మాత్రం అన్యాయం చేయను... నా మాట నమ్ము..."

నమ్ముతాను అన్నట్టు తల ఊపింది "గుడ్.." అంటూ విశాల్ బ్యాగ్ తీసుకుని ఆఫీసుకి వెళ్లిపోయాడు... అతను వెళ్లినవైపు చూస్తూ అలాగే నిలబడిపోయింది అపర్ణ....

ఆరోజు ఆదివారం....

విశాల్ ఆలస్యంగా నిద్రలేచాడు... నాలుగు రోజులుగా సరిగా నిద్ర పట్టడం లేదు... ఏదో అశాంతి మనసుని ఆవరించి నిద్రలేకుండా చేస్తోంది... అపర్ణ ఇచ్చిన కాఫీ తాగి, న్యూస్‌పేపర్ చదువుకుంటూ కూర్చున్నాడు.. మాధవి ఇండియాకి వచ్చి నాలుగు రోజులైంది... ఇంతవరకూ విశాల్ అటు వెళ్లడం గానీ, మాధవి విశాల్‌ని కలుసుకోడం గానీ జరగలేదు... ప్రాణాలు ఉగ్గబట్టుకుని జరగబోయే సంఘటన కోసం ఎదురుచూస్తోన్న అపర్ణ మనసిప్పుడు కొంచెం కుదటపడినట్టుంది.... మామూలుగా నవ్వుతూ తిరుగుతోంది

విశాల్ మాత్రం మాధవి గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు... అదృష్టవంతురాలు... అనుకున్నది సాధించింది అనుకున్నాడు. ఎంత కాదనుకున్నా ఆమె తన భార్య... మూడేళ్లు ప్రేమించి, కోరి, కోరి పెళ్లి చేసుకున్నాడు... ఇద్దరూ కలిసి భవిష్యత్తు గురించి ఎన్నెన్నో కలలు కన్నారు. అందమైన ఆశాసౌధాలు నిర్మించుకుని అందులో అన్యోన్యమైన దాంపత్య జీవితాన్ని డిజైన్ చేసుకున్నారు... కానీ, కెరియర్ ముఖ్యం అంటూ ప్రేమనీ, బాధ్యతల్నీ కూడా కాలితో తన్ని వెళ్లిపోయింది మాధవి... ఆమెది స్వార్థమా, రాక్షసత్వమా? లేక ఆమె చేసింది కరెక్టా... నిట్టూర్చాడు విశాల్. తప్పకుండా ఆమెకి తను అపర్ణని పెళ్లి చేసుకున్నట్టు తెలిసే ఉంటుందీపాటికి... వెళ్లిన కొత్తల్లో కొన్ని మెయిల్స్ పంపించింది... కానీ తను సరిగా రెస్పాండ్ అవకపోవడంతో మెయిల్స్ ఆగిపోయాయి... ఇప్పుడు ఇండియా వచ్చిన తరువాత కూడా తనని కలవడానికి ప్రయత్నించలేదంటే ఆమె తప్పకుండా తనని మర్చిపోయి ఉంటుంది... ఇప్పుడు ఆవిడ తనకన్నా విద్యాధికురాలు... తను కేవలం బి.టెక్... విదేశాల్లో ఆవిడ ఎంఎస్ చేసి వచ్చింది. తాత్కాలికంగా వచ్చి తల్లితండ్రుల్ని చూసి వెళ్లిపోతుందేమో... అక్కడ ఎంఎస్ చేసి, ఇక్కడ ఉద్యోగం చేయడానికి పిచ్చిదికాదు కదా... తప్పకుండా అక్కడేదో మంచి ఉద్యోగం దొరికి ఉంటుంది... విశాల్‌కి ఎక్కడో ఏమూలో కొంచెం ఈర్ష్యగా అనిపించింది... బాధగా కూడా అనిపించింది... ఏం ఊహించాడు... ఏం జరిగింది ఆ రోజు మాధవి తనతో గొడవపడి వెళ్లిపోవడం గుర్తొచ్చింది.

బి.టెక్ చదివే రోజుల్లో ఇద్దరూ ప్రేమించుకున్నారు... ఇద్దరికీ ఎంఎస్ చేయాలన్నది ఆశయం. బి.టెక్ అయిపోగానే ఇద్దరూ కలిసి అమెరికాలోని చాలా యూనివర్సిటీల్లో ఎంఎస్‌కి అప్లై చేశారు. లక్కీగా ఇద్దరికీ కూడా రెండు, మూడు యూనివర్శిటీల్లో సీటొచ్చింది. ప్రయా

---



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్వ్య

## అలారం మోగింది

పాత నాణాలు సేకరించేవాళ్లను న్యూమిస్మాటిస్టులంటారు. అదో హాబీ. కొందరైతే, దేశదేశాలు తిరిగి మరీ సేకరిస్తారు. ఒక అరుదైన నాణెం కోసం ఆస్తులమ్ముకున్న వాళ్లున్నారు. అలాంటి ఒక పెద్దమనిషి ఫిలడెల్ఫియాలో జరుగుతున్న అమెరికన్ న్యూమిస్మాటిక్స్ సమావేశానికి వెళ్లినప్పుడు ఆయన ఆప్తమిత్రుడు జాన్ - యింటికి అతిథిగా వచ్చాడు.

ఇంట్లో మరెవరూ లేరు. సేఫ్‌లో అమూల్యమైన నాణాలున్నాయి. రెండు రోజులు ఒంటరిగా గడపాలి. అయితే వచ్చిన మర్నాడే జాన్‌ను ఎవరో హత్య చేశారు. పడకగదిలో, మంచానికి నాలుగడుగుల దూరంలో పడి వుంది మృతదేహం.

"ఈయన బధిరుడు. ఆపరేషన్ చేస్తే మళ్లీ వినగలడని డాక్టర్లు సలహా యిచ్చారట. మిత్రుడు సహాయం చేస్తానంటే వచ్చాడు. పాపం, యిలా ముగిసింది జీవితం. రాత్రి రెండున్నరకు హత్య జరిగినట్టుగా విచారణలో తేలింది. జాన్ గాఢనిద్రలో వున్నప్పుడు ఎవరో డూప్లికేట్ తాళం చెవితో తలుపు తీసి లోపలికి ప్రవేశించివుంటారు. ఆటోమేటిక్ అలారం మోగటంతో లేచి అగంతకుణ్ణి ప్రతిఘటించాడు జాన్. ఆ చప్పుడు విని పక్కింటి యజమాని కూడా పరిగెత్తుకుని వచ్చాడు. కాని అప్పటికే జాన్‌ను ఛాతీలో పొడిచి పారిపోయాడు హంతకుడు. సేఫ్‌ను తెరచిన ఆనవాలు లేదు." అంటూ సేకరించిన సమాచారమంతా చెప్పాడు ఇనస్పెక్టర్.

"ఫిలడెల్ఫియా వెళ్లిన మిత్రుణ్ణి విచారించారా?"

"మూడు రోజులుగా అతడక్కడే వున్నాడు. బలమైన ఎలిబీలున్నాయి. కన్వెన్షన్‌లో అతిచురుగ్గా పాల్గొన్నాడు. మిగతా సమయంలో మిత్రులతో కలిసి పార్టీలు చేసుకున్నాడు. అయినా, యింటికి ఆహ్వానించిన మనిషి ఎందుకు హత్య చేస్తాడు".

"అలారం మోగినప్పుడు వచ్చిన పక్కింటి యజమానిని ప్రశ్నించండి. హంతకుడి ఆచూకీ తెలుస్తుంది" అన్నాడు డిటెక్టివ్.

డిటెక్టివ్ కెందుకా సందేహం వచ్చింది?

సమాధానం: అలారం మోగితే బధిరుడికి వినిపిస్తుందా? హత్య వెనక మరేదో తిరకాసుండాలి.

ణానికి అన్ని ఏర్పాట్లు అయ్యాయి. ఆడపిల్లను పరాయి మగాడితో అంతదూరం ఒంటరిగా పంపడం ఇష్టం లేని మాధవి తల్లి, తండ్రులు ఎలాగా వాళ్లు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారని తెలిసి, పెళ్లి చేసుకుని వెళ్లమన్నారు... అందుకు మాధవి కానీ, విశాల్‌కానీ పెద్దగా అభ్యంతర పెట్టలేదు.. అదీ ఒకందుకు మంచిదే అనిపించింది వాళ్లకి... అంగరంగవైభవంగా పెళ్లి అయింది... మాధవి విశాల్ చేయందుకుని అతని ఇంటికి ఇల్లాలిగా వచ్చింది... అందం, ఐశ్వర్యం, చదువు అన్నీ ఉన్న కోడల్ని చూసి ప్రభావతి మురిసిపోయింది.

విదేశీ ప్రయాణానికి సుమారు నెల, నెలన్నర ముందునుంచీ వాళ్ల దాంపత్య జీవితం రసవంతంగా సాగిపోయింది.

అయితే ఓ రోజు ఉదయం అనుకోకుండా విశాల్ తల్లి ప్రభావతిగారు జబ్బు పడింది. నోటినుంచి రక్తం కక్కుకుంటున్న ఆవిడని ఖంగారుగా హాస్పిటల్‌కి తీసికెళ్లిన విశాల్ డాక్టర్స్ చెప్పిన వార్తతో షాక్ తిన్నాడు. ఆవిడకి బ్రెస్ట్ క్యాన్సర్... ఊహించని ఆ పరిణామంతో విశాల్ హతాశుడైనాడు... ఏం చేయాలో దిక్కుతోచలేదు... జబ్బుగా ఉన్న తల్లిని వదిలి విదేశాలకు వెళ్లడానికి అతనికి మనస్కరించలేదు... ఒక్కగానొక్క కొడుకుగా ఆవిడనలా వదిలి వెళ్లడం బాధ్యతారాహిత్యమే కాక మానవత్వం కాదనిపించింది. అందుకే ఎంఎస్ ఆశ చంపేసుకున్నాడు. మాధవి మాత్రం విదేశీ ప్రయాణం క్యాన్సిల్ చేయడానికి ససేమిరా అంగీకరించలేదు... "నీ తల్లి కాబట్టి నువ్వు నీ ప్రయాణం క్యాన్సిల్ చేసుకోవడంలో అర్థం ఉంది. నేనెందుకు క్యాన్సిల్ చేసుకోవాలి? నేనెందుకు నా ఆశయం వదులుకోవాలి. ఎంత కష్టపడి సీటు సంపాదించాము సీటొచ్చి, వీసా వచ్చి, టికెట్స్ కూడా బుక్ చేశాక క్యాన్సిల్ చేయడం నాకిష్టం లేదు." అని తేల్చింది మాధవి.

"మరోసారి ఈ అవకాశం తప్పకుండా వస్తుంది మధూ.. నా మాట విను... ఈ సమయంలో అమ్మని వదిలి వెళితే లోకం ఏమంటుంది... లోకం సంగతి పక్కన పెట్టు మన అంతరాత్మ అంగీకరిస్తుందా?" అని బతిమాలాడు.

"నీ అంతరాత్మ అంగీకరించకపోవచ్చు... కానీ నా అంతరాత్మ అంగీకరిస్తుంది... సారీ" అంది... ఎంత నచ్చ చెప్పినా వినకుండా ప్రయాణం అయింది.

విశాల్‌కి ఆ సమయం భయంకరమైన పరీక్షా సమయం అయింది. ఒకవైపు అనారోగ్యంతో ఉన్న తల్లి... మరోవైపు ప్రేమించి పెళ్లాడిన భార్య... మరో వైపు ఆహ్వానిస్తున్న అందమైన భవిష్యత్తు... ఏం చేయాలో అర్థం కాలేదు. మాధవి ఈ సమయంలో తనకి అండగా ఉంటే ఈ నిరాశని అందంగా భరించవచ్చు అనిపించింది. అమ్మ బాధ్యత ఇద్దరూ కలిసి పంచుకుని ఇక్కడే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చు అనిపించింది. మాధవి తల్లి తండ్రులతో కూడా పరిస్థితి వివరించి చర్చించాడు. వాళ్లకే మాధవి మొండితనం నచ్చలేదు... కూతురికి నచ్చ చెప్పారు.. మాధవి వినలేదు.. నా కెరియర్ కన్నా నాకేదీ ముఖ్యం కాదు అని తేల్చి చెప్పింది.

నిర్దయగా అత్తగారిని, నిర్లక్ష్యంగా భర్తని వదిలి విదేశాలకు వెళ్లిపోయింది.

కాలింగ్ బెల్ మోగడంతో విశాల్ గతం నుంచి తెప్పరిల్లాడు. న్యూస్‌పేపర్ అతని ఒడిలో పడి ఉంది.. "ఎవరో వచ్చారు అపర్ణా" అన్నాడు.

ఫ్లవర్‌వాజ్‌లో పూలు సర్దుతోన్న అపర్ణ ఫ్లవర్‌వాజ్ జాగ్రత్తగా స్టాండ్ మీద పెట్టి తలుపు తీయడానికి వెళ్లింది... తలుపుతీసిన అపర్ణ గుండెల్లో ఒక్కసారిగా డైనమైట్ పేలినట్టు అయింది. ఎదురుగా పచ్చని ఒంటి రంగుతో, స్లీవ్‌లెస్ బ్లౌజు, మావిడిపండు రంగు డిజైనర్ చీర కట్టుకున్న అందమైన యువతి. ఎక్స్‌క్యూజ్‌మీ అంటూ అపర్ణని తప్పించుకుని లోపలికి వచ్చింది. అపర్ణ చైతన్యరహితంగా పక్కకి జరిగి గోడకు ఆనుకుని శిలలా నిలబడింది. ఆ యువతి హాల్లోంచి స్టైల్‌గా నడుస్తూ విశాల్ కూర్చున్నవైపు వెళ్లింది. ఆమెని చూడగానే విశాల్ చేతిలోంచి న్యూస్‌పేపర్ జారి కిందపడింది. చటుక్కున లేచి నిలబడ్డాడు.

ఆ యువతి అతని దగ్గరగా నడిచి ఎదురుగా నిలబడి అతని కళ్లల్లోకి చూస్తూ... హలో.. అంటూ చేయి చాచింది షేక్‌హ్యాండ్ కోసం.. విశాల్ అప్రతిభుడిలా నిలబడిపోయాడు.

"షాక్ తగిలిందా? బహుశా నేను వస్తానని ఊహించి ఉండవు.. అవునా.. మాధవి... నేను మాధవిని. ఆ యామ్ మాధవి ఎంఎస్" అంటూ నవ్వింది.

విశాల్ మొహం జేవురించింది. కోపం అణుచుకుంటూ "కూర్చో" అంటూ ఆమెకి సోఫా చూపించి తను కూర్చున్నాడు. మాధవి కాలు మీద కాలేసుకుని కూర్చుంది.

విశాల్ గోడకి బల్లిగా అంటుకుపోయి నిర్జీవంగా నిలబడిన అపర్ణ వైపు చూస్తూ "అపర్ణా... కాఫీ తీసుకురా" అన్నాడు మృదువుగా.

అపర్ణ అలాగే చైతన్యరహితంగా నడుస్తూ వంటగదిలోకి వెళ్లింది.

వెనక్కితిరిగి భుజమ్మీదుగా అపర్ణ నిలబడినవైపు చూస్తు... "ఈమెనేనా నువ్వు ఇల్లీగల్‌గా మ్యారేజ్ చేసుకున్నావుట... గుడ్... మంచి ఇల్లాలు..".

విశాల్ అదేం వినిపించుకోనట్టుగా "సక్సెస్ ఫుల్‌గా తిరిగి వచ్చినందుకు కంగ్రాట్స్" అన్నాడు.

"థాంక్స్... మాధవి జీవితంలో సక్సెస్ తప్ప ఫెయిల్యూర్స్ ఉండవు" అంది.

విశాల్ మాట్లాడలేదు...

మాధవి కాలుమీంచి కాలు తీసేసి కొంచెం ముందుకు వంగి అంది. "భార్య బతికి ఉండగా మరో పెళ్లి చేసుకున్నావంటే నువ్వు చాలా ధైర్యస్తుడివి అనుకోమంటావా? మగాడినన్న అహంకారంతో ఏం చేస్తుందిలే అది అన్న నిర్లక్ష్యంతో చేసుకున్నావనుకోమంటావా?"

విశాల్ మాట్లాడలేదు. మౌనంగా చూపులు తిప్పుకుని అప్పుడే అపర్ణ సర్దిన పూలకేసి చూస్తుండిపోయాడు.

"నేనిప్పుడు కోర్టుకి వెళితే ఏం చేస్తావు?"

విశాల్ అప్పుడు కూడా ఏం మాట్లాడలేదు..

"నీకున్న సెల్ఫ్‌కాన్ఫిడెన్స్‌కి అభినందించాలో, తిట్టాలో అర్థం కావడం లేదు. నీకూ, నాకూ మధ్య జరగబోయే వార్‌లో ఆ అమ్మాయి విక్టిమ్ అవుతుందని నీకు తోచలేదా? నీ స్వార్థం కోసం ఓ అమాయకురాలి జీవితం నాశనం చేస్తున్నానన్న ఆలోచన రాలేదా?".

విశాల్ చూపులు తిప్పి మాధవి వైపు సూటిగా చూశాడు. అమెరికా నీళ్లు బాగా వంట పట్టాయేమో ఎప్పటికన్నా రంగు వచ్చింది. స్లిమ్‌గా అయింది. చాలా ఆధునికంగా అలంకరించుకుంది. చదువు తెచ్చిన కళతో మెరిసిపోతోంది.

నెమ్మదిగా అన్నాడు. "ఆరోజు నా మాట వినకుండా నిర్లక్ష్యంగా నీ దారిన నువ్వు వెళ్లిపోయిన రోజు నేనిలా చేస్తానని, చేయగలనని నువ్వు ఊహించలేదా? నీ కోసం మూడు సంవత్సరాలు మునిలా ఎదురు చూస్తానన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఎలా ఉన్నావు?"

మాధవి నవ్వింది. "నేను ప్రేమించి పెళ్లిచేసుకున్న వ్యక్తి ఒక మామూలు మగాడిలా ప్రవర్తిసాడని నేనూహించలేదు".

"సో... నువ్వు తప్పు చేశావని నీకు అనిపిస్తోందా?".

మాధవి మాట్లాడలేదు.. టీపాయ్ మీద ఉన్న వారపత్రికల వైపు చూస్తూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. తరువాత అంది. "అవును నేను తప్పు చేశాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని నమ్మి నిన్ను పెళ్లి చేసుకున్నాను. చాలా పెద్ద తప్పు చేశాను. అయితే, హిందూ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం తప్పైనా, ఒప్పైనా నా స్థానాన్ని అనుమతి లేకుండా మరొక స్త్రీకి ఇవ్వడం నువ్వు చేసిన నేరం. ఈ నేరాన్ని సవాల్ చేసే హక్కు నాకుంది.. నా స్థానాన్ని తిరిగి పొందే హక్కు కూడా నాకుంది అనుకుంటా..."

"హక్కులు..." నిర్లక్ష్యంగా అన్నాడు... "హక్కుల గురించి పోరాడేముందు నీ బాధ్యతల్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో... ఒక కోడలిగా నీకేం బాధ్యత లేదా? నన్ను భర్తగా అంగీకరించే ముందే నా వాళ్లని కూడా నీ వాళ్లుగా అంగీకరించాలన్న నిజం నీకు తెలియదు. అందుకే అవసానదశలో ఉన్న అత్తగారి మీద కనికరం లేకుండా నీ స్వార్థం చూసుకుని వెళ్లిపోయావు.."



## అబ్బే! అదంతా స్నేహమే...

బాలీవుడ్‌లో అవకాశాలు రాక, కోలీవుడ్ కలిసిరాక ఖాళీగా ఉంటున్న అసిన్ కన్ను ఓ బాలీవుడ్ హీరో మీద పడింది. అతగాడితో కలిసి పబ్‌లకి, ఫైవ్ స్టార్ హోటల్స్‌కి తెగ తిరుగుతూ కొంతమంది కంట్లో పడింది. అప్పటి నుంచీ వారిద్దరి మధ్య ఏదో ఎఫైర్ నడుస్తోందనీ, బాలీవుడ్‌లో పుకార్లు తెగ షికార్లు చేస్తున్నాయి. "ఈ పుకార్లను నేను అస్సలు పట్టించుకోను. మా ఇద్దరి మధ్య ఉంది కేవలం స్నేహం మాత్రమే! ఆ స్నేహంతోనే ఇటీవల ఒకటి రెండు ఫంక్షన్లకు వెళ్లాం తప్పించి, మా మధ్య ఇంకేం లేదు" అని అసిన్ ఓ సుదీర్ఘ వివరణ ఇచ్చింది. అసిన్ మాటలు నమ్మడానికి బాలీవుడ్‌లో ఎవరూ సిద్ధంగా లేరన్నది నూటికి నూరు శాతం నిజం.

''యస్... నన్ను పాతికేళ్లు పెంచిన నా తల్లితండ్రుల్నే నేను కేర్ చేయలేదు.. కేవలం నెలన్నర పరిచయం ఉన్న ఆవిడ కోసం నేనెందుకు నా కెరియర్ త్యాగం చేయాలి?''

''అవును నిజమే.... నన్ను కనిపెంచి, నాకోసం తన సుఖాల్ని త్యాగం చేసిన నా తల్లికోసం నేను మాత్రం కేవలం మూడు ముళ్ల బంధం కోసం నా తల్లినెందుకు త్యాగం చేయాలి... అందుకే చేయలేదు... నా తల్లి సుఖం కోసం, ఆవిడ మనశ్శాంతి కోసం ఏం చేయాలో అదే చేశాను. ఈ విషయం నువ్వు ఏ కోర్టులో సవాల్ చేసుకుంటావో చేసుకోవచ్చు''.

''తల్లి, తల్లి అనుకునే మగాడికి పెళ్లి చేసుకునే అర్హత లేదు... ఎందుకు చేసుకున్నావు?''

''అలాగా!... కెరియర్ కోరుకునే ఆడదానికి మాత్రం పెళ్లిచేసుకునే హక్కుందా? లేదు... నువ్వు మాత్రం ఎందుకు చేసుకున్నావు?''

''ఓ.కె. జరిగిందాంట్లో తప్పంతా నామీద వేసేయాలన్న నిర్ణయానికి వచ్చావనమాట... అలా అయితే నా స్థానం నేను పొందడానికి ఏం చేయాలో నాకు బాగా తెలుసు...''

వంటగదిలో కాఫీ కలుపుతోన్న అపర్ణ చేతుల్లో గిన్నె వణికింది.. తీవ్ర స్థాయిలో వినిపిస్తోన్న వాళ్లిద్దరి స్వరాలు ఆమెకి భయంతో ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఏం జరగబోతోంది... జారిపోబోతున్న గిన్నె గట్టు మీద పెట్టి నిలువెల్లా వణికిపోతూ శిలలా నిలబడిపోయింది.

హఠాత్తుగా ''అపర్ణా'' అంటూ గట్టిగా మాధవి స్వరం వినిపించింది. గుండె గుభిల్లుమంది. కాళ్లు నేల కంటున్నట్టుగా నిలబడ్డ చోటే స్తంభించిపోయింది.

''అపర్ణా... నిన్నే బైటకిరా..'' మాధవి స్వరం అదే తీవ్రస్థాయిలో వినిపించింది.

''మన మధ్య తనెందుకు? తనేం చేసింది... ఏం మాట్లాడాలో నాతో మాట్లాడు'' విశాల్ స్వరం కూడా అదే స్థాయిలో వినిపించింది.. ఎక్కడి నుంచో పెద్ద, పెద్ద రాళ్లు తన తలమీద పడుతున్న భావన... ఒంటినిండా గాయాలై రక్తం కారుతున్న పక్షిలా విలవిల్లాడుతోంది అపర్ణ... కళ్లు వర్షిస్తున్నాయి... అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడలేకపోయింది.. గుండె దిటవు చేసుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ బైటికి వచ్చింది.

ఆమెనా స్థితిలో చూసిన విశాల్, మాధవి కూడా అవాక్కయ్యారు. ఒక్క నిమిషం పాటు అంతటా నిశ్శబ్దం ఆవరించింది... మాధవి ముందుగా తేరుకుని లేచి నిలబడి అపర్ణవైపు సూటిగా చూస్తూ, నెమ్మదిగా నడుస్తూ ఆమె వైపు వచ్చింది. అపర్ణ రెండు చేతులూ జోడించి కుప్పకూలినట్టుగా కింద కూర్చుండిపోయింది.

విశాల్ ఖంగారుగా పరిగెత్తుకుంటూ వచ్చి అపర్ణా అంటూ ఆమెని లేవనెత్తబోయాడు. మాధవి గట్టిగా అరిచింది. ''ఆగు''.

విశాల్ నిశ్చేష్టుడిలా చూశాడు.

మాధవి ఒంగి అపర్ణని భుజాలు పట్టుకుని లేవనెత్తింది. అపర్ణ వెక్కి, వెక్కి ఏడుస్తూ ''క్షమించండి.. నేను వె...ళ్లి... పో'' అంటూ మొహానికి చేతులు అడ్డం పెట్టేసుకుంది.

మాధవి కొన్నిక్షణాలు అలాగే చూస్తూ నెమ్మదిగా అంది. ''ఇంత భయం ఉన్నదానివి ఎలా కట్టించుకున్నావీ తాడు?'' అపర్ణ మెడలో మంగళ సూత్రం వేలితో పైకెత్తుతూ అడిగింది.

అపర్ణ ఏం మాట్లాడలేదు.. రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది.

''ఎందుకేడుస్తున్నావు? ఈ ఇంట్లో స్థానం పోతోందని భయమా? తప్పు చేశానన్న పశ్చాత్తాపమా?''

''మాధవీ... తను అమాయకురాలు... దయచేసి తనని వదిలెయ్. నీ అంత బ్రేవ్ కాదు.. మనం మనం తేల్చుకుందాం''.

విశాల్ మాటలకి చివ్వున చూసింది మాధవి... ''అమాయకురాలు కాబట్టే ఈజీగా మభ్యపెట్టి ఆమెని పెళ్లి చేసుకున్నావు... మనం, మనం తేల్చుకున్నా ఇప్పుడు నష్టపోయేది తనే... భవిష్యత్తు ఏం నిర్ణయించుకుందో తెలియాలి కదా... లేకపోతే ఏదన్నా ఆధారం చూపించి పంపిస్తాను..''

''నువ్వెవరు పంపడానికి?''

విశాల్ మాటతో ఛర్రున చూసింది.. ''ఈ ఇంటి యజమానురాలిని''.

''నీకా హక్కు లేదు..''

''ఉందో, లేదో తేల్చాల్సింది నువ్వు కాదు.. లా...''

''మీకు పుణ్యం ఉంటుంది. ఆయన్నేం అనకండి... జరిగిందాంట్లో ఆయన తప్పేం లేదు''.

భారమైన స్వరంతో అంటోన్న అపర్ణవైపు చూస్తూ ''మరి ఎవరిది? నీదా? నువ్వే అతడిని లొంగదీసుకున్నావా?''

ఒక్కసారిగా ఆ మాటకి దుఃఖం ఎగదన్ని భోరుమంది అపర్ణ.

విశాల్ ఉగ్రుడయ్యాడు. గభాల్న అపర్ణని పొదివి పట్టుకుని మాధవి వైపు అసహ్యం నిండిన కళ్లతో చూస్తూ అరిచాడు. ''రాక్షసీ! తప్పెవరిదో నీకు తెలియదు? ఇంకా నీ తప్పు నువ్వు తెలుసుకోలేదంటే ఈ జన్మలో నువ్వు తెలుసుకోలేవు.. ఒకె... నీకేం కావాలి? ఆస్తా... రాసిస్తా... దయచేసి మా జీవితాల్లోంచి వెళ్లిపో... నీకు నమస్కారం చేస్తా..''

మాధవికి అతని చూపులు గుండెల్లో గురిచూసి విసిరిన కత్తుల్లా అనిపించాయి. ఆ చూపులకి గుండె ముక్కలుగా విరిగి పడుతున్న భావన కలిగింది. అతని మాటలు ఒక్కొక్క అక్షరం ఒక్కో బాకులా తాకుతున్నట్టు అనిపించింది. అతని చేతుల మధ్య గువ్వపిట్టలా ముడుచుకుని ఉన్న అపర్ణవైపు చూసింది... కళ్లల్లోకి చివ్వున దూసుకొచ్చింది బాధ... అది కనిపించకుండా కళ్లు తిప్పేసుకుంది... హు... ఎంతప్రేమ... అంతేలే అణిగి, మణిగి ఉండే ఇల్లాళ్లంటే మగాళ్లకి ప్రేమే... ఆ ప్రేమలో అనురాగం కన్నా, స్వార్థమే ఎక్కువ. భవిష్యత్తుని అల్లుకోడానికి పందిరి కోసం వెతికే ఆడపిల్లలకి స్వార్థంలోనే ప్రేమ కనిపిస్తుంది. నెమ్మదిగా, స్థిరంగా స్వరంలో విశ్వాసం ఒలికిస్తూ అంది...

''నీ ఆస్తికోసం, నీతో జీవితం కోసం తపించి, దేబిరించే స్థితిలో లేను.. నీలాంటి వాళ్లను పదిమందిని పోషించగల స్థితిలో ఉన్నాను.''

అపర్ణ దగ్గరగా నడిచింది మాధవి. అప్రయత్నంగా అపర్ణని వదిలేసి కొంచెం ఎడంగా జరిగాడు విశాల్. అపర్ణ భయంగా చూసింది మాధవిని. నీళ్లల్లో తడిసిన చేపపిల్లల్లా ఉన్న ఆమె కళ్లు చూస్తుంటే జాలేసింది మాధవికి.

''నాకు చదువుంది... డబ్బుంది... ధైర్యం ఉంది.. అన్నిటికీ మించి బతకగలనన్న ఆత్మవిశ్వాసం ఉంది. కానీ, నీకు బతుకంటే భయం తప్ప ఏమీ లేనట్టున్నాయి... ముఖ్యంగా ఆత్మవిశ్వాసం లేని ఆడదానికి బతికే అర్హత లేదు తెలుసా''... అపర్ణ ఏడుస్తూ తల వంచుకుంది.

''చూశావా! జరిగినదాంట్లో నీ పాత్ర కొంచెమే అయినా తప్పంతా నీదే అన్నట్టుగా ఓ నేరస్థురాలిలా తల వంచుకున్నావు. కానీ, అతన్ని చూడు ఎంత ఠీవిగా తలెత్తుకుని ఉన్నాడో...'' విశాల్ వైపు చూసింది... విశాల్ విసురుగా తల తిప్పేసుకున్నాడు.

మాధవి అదోరకంగా నవ్వింది... ''అపర్ణా...! ఒక్క విషయం మాత్రం నీకు చెప్పడానికి నేనిక్కడికి వచ్చాను... పరాధీనగా బతికే ఆడదానికి జీవితమంతా అభద్రతా భావం పగబట్టిన పాములా వెంటాడుతూ ఉంటుంది... ఇవాళ అభయం కలిగించిన అతని రెండు చేతులూ రేపు ఏ కారణం చేతనన్నా నిన్ను వదిలేస్తే ఎలా బతకాలో ఆలోచించుకో... కేవలం ఓ రక్షణ కోసం, భద్రత కోసం నీదికాని స్థానం ఆక్రమించావు. కానీ, ఒక్క క్షణం ఈ ఇంటి ఇల్లాలు తిరిగివస్తే నా పరిస్థితి ఏంటి అని ఆలోచించి ఉంటే నీ జీవితాన్ని మరో విధంగా మలుచుకునే దానివి... ఆడదానికి రక్షణనిచ్చేది తన చేతులు, తన కాళ్లే... వాటి మీద ఆధారపడడంలో ఉన్న ఆనందం మగాడిమీద ఆధారపడి బతకడంలో లేదు''.

విశాల్‌వైపు తిరిగి అంది... ''ఇంక నుంచన్నా ఆమెకి బతుకంటే మమకారం కలిగించు... భయం కాదు.. గుడ్ బై...''

నెమ్మదిగా, ఠీవిగా వెళ్లిపోతోన్న మాధవి వైపు నిర్విణ్ణులై చూస్తూ ఉండిపోయారు అపర్ణా, విశాల్....

*

రచయిత సెల్ నెం: 9030372766

